పెళ్ళంటే చిరాకు నాకు.

పెళ్ళి అనగానే జీవితాంతం తోడుగా వుండే ఓ అందమైన అమ్మాయి గుర్తు రాదు నాకు కులం, గోత్రం, జాతకం వగైరా ముద్రలతో ముఖమెలా వుందో తెలియని మనిషి గుర్తుకొస్తుంది.

చిన్నప్పట్నించీ అదో రకం తత్వం నాది. ఎలక్ట్రానిక్సులో నాకు డిగ్రీ లేకపోయినా ఆ సబ్జక్టు నాకు కరతలామలకం. అదే నాకు జీవనోపాధి కూడా. ఎలక్ట్రానిక్సుపయోగించి నిత్య జీవితావసర వస్తువులెన్నో నేను తయారుచేసి అమ్ముతున్నాను. రకరకాల పిల్లల బొమ్మలు కూడా సృష్టిస్తున్నాను. నా సంపాదన నన్ను లక్షాధికారిని చేసింది. నాకింకా ముప్ఫై ఏళ్ళు రాలేదు.

నా ముత్తాతగారు వీరేశలింగంగారి కంటె పెద్దవారు నా తాతగారు వీరేశలింగంగారికంటె కొద్దిగా చిన్నవాడైనప్పటికీ ఆయనకు సమకాలీకుడనే చెప్పవచ్చు. నా తండ్రిగారు వీరేశలింగంగారు మరణించడం ఎరుగుదురట.




ఈ ముగ్గురిలో మొదటి ఇద్దరికీ ఆయనతో బాగా పరిచయముంది. మొత్తం ముగ్గురికీ వీరేశలింగంగారి ఆశయాల గురించి బాగా తెలుసు. వీరేశలింగంగారి గురించి ఆయన తన ఆశయ సాధన కోసం ఆ రోజుల్లో పడ్డ శ్రమ గురించి ఆ ముగ్గురూ కథలు వర్ణించి చెప్పేవారు. వారి జీవితంలో వీరేశలింగం గారి పరిచయం గర్వించదగ్గ విశేషం.

అయితే మా ఇంట్లో అరటిగెల దిశ తప్పు వేస్తే చెట్టు కొట్టించి గెల ఎవరికైనా ఇవ్వవలసిందే; ఏ చిన్న ప్రయాణానికైనా పురోహితుణ్ణి పిలిపించి ముహూర్తం పెట్టించాల్సిందే!

వరుసగా మూడుతరాలపైన వీరేశలింగం గారి పరిచయం ఏ ప్రభావమూ చూపించలేకపోయింది. ఇది గ్రహించిన నాకు అనిపిస్తూంటుంది— మహాత్ములంటే మనకు గౌరవం ఉంది. వారి ఆశయాలకు మన మెదడులో స్థానం వుంది. వారికి శిలావిగ్రహాలు కట్టించి, వారిఫొటోలకు పూలమాలలు వేసి, వారి పేర్లతో భవనాలూ, రోడ్లూ, తోటలూ నిర్మించి, వారి చరిత్రలను గ్రంథస్థంచేసి వారిపట్ల మనకున్నగౌరవాన్ని ప్రదర్శించుకుంటున్నాం. వారి ఆశయాల్ని ఆచరణలో చూపాలన్న ఆలోచనే మనకు రాదు.అందుకే గొప్పవాళ్ళు ఎందరు పుట్టినా వారు చరిత్రలో మిగిలిపోతున్నారు. మనిషి తనకుండే మూఢవిశ్వాసాలను ఎన్నితరాలు గడిచినా విడిచిపెట్టలేకపోతున్నాడు.

అందుకే నా తర్వాత ఇంకో తరాన్ని సృష్టించడం నాకిష్టంలేదు. నిరర్థకమైన కొందరు కొత్త మనుషుల్ని ఈ ప్రపంచంలోకి తీసుకురావడం నా కిష్టంలేదు. ఈ

ప్రపంచానికి నేను చేయగల సేవ అంటూ వుంటే ఇదొక్కటే! నాది ఉడతాభక్తి మాత్రమే కావచ్చు. అయినా పెళ్ళి చేసుకో కూడదనే నిర్ణయం తీసుకున్నాను.

నాకు ముగ్గు రన్నయ్యలున్నారు. ఒక అక్కయ్య వుంది. ఇద్దరు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. వీరిలో పద్నాలుగేళ్ళ ఒక్క చెల్లెల్ని మినహాయిస్తే మిగతా అందరికీ పెళ్ళిళ్ళైపోయాయి. నా తమ్ముళ్ళ పెళ్ళిళ్ళుకూడా జరిగిపోయినా నా పెళ్ళి జరగడంలేదని అమ్మ గోల పెట్టేస్తూంది.

అమ్మ తనకు ఆరోగ్యం బొత్తిగా బాగా లేదనీ, నన్ను రమ్మనమనీ ఓ ఉత్తరం రాయగానే నాలోరకరకాలఆలోచనలురేగేవి. ఆ ఉత్తరం పెళ్ళిగురించి నన్ను ప్రోత్సహించడానికేనని నాకు తెలుసు. అమ్మకు ఎలా సమాధానం చెప్పాలో తెలియక తికమకపడేవాణ్ణి. ఆమె ప్రశ్నల కెదురుచెప్పలేక ఆఖరికి మొండిగా జవాబు చెప్పి వచ్చేసేవాణ్ణి.

అయితే ఈసారి నాకా బెంగలేదు. ఆర్నెల్లనుంచి నేను అమ్మ ఉత్తరం కోసం ఎదురుచూస్తున్నాను కూడా. ఉత్తరంరాగానే రెక్కలు కట్టుకుని అమ్మదగ్గరకు వెళ్ళాను.

నేను వెళ్ళగానే అమ్మ తన పురాణం విప్పింది.

"అసలు పెళ్ళి ఎందుకమ్మా?" అన్నాను.

"జీవితంలో మనిషికి తోడు కావాలి కదరా...." అంది అమ్మ.

"నేనిప్పుడో తోడు సంపాదించానమ్మా...." అన్నాను.

అమ్మ కళ్ళు మెరిశాయి.... "ఎవర్రా?" అంది.

"వాడి పేరు.... వాడిపేరు...." చెప్పడానికి తటపటాయించాను.

"మగాడి సంగతా? ఇంకా నువ్వు ఏ ఆడపిల్లనైనా ప్రేమించినావేమో అనుకున్నాను." అంది అమ్మ నీరసంగా. ఆమె అంత నీరసంగా మాట్లాడుతుందని నేనూహించలేదు.

"నువ్వు తోడు గురించి చెప్పావు కానీ ఆడా, మగా సంగతి చెప్పలేదు...."

"మగతోడు ఆడతోడుకు సాటి వస్తుందటరా" అంది అమ్మ. ఆడదైతే చక్కగా వంట చేస్తుందట. ఇల్లు శుభ్రంగా ఉంచుతుందట. చెప్పినట్లు వింటుందట.

"ఇంతేకదా— నాకు దొరికిన తోడుకూడా ఈ పనులన్నీ చేస్తాడు...." అన్నాను.

అమ్మ చిరాగ్గా నావంక చూసి "ఎన్నాళ్ళు చేస్తాడు? తనకికూడా ఆడతోడు దొరికేవరకు అంతేకదా." అంది.

"వాడూనాకులాగే పెళ్ళిచేసుకోడమ్మా!" అన్నాను.

"అంటే వాడు పెళ్ళాం వచ్చినా?ముసలాడయ్యేంటాడు.వాడెన్నాళ్ళు బ్రతుకుతాడు?" అంది అమ్మ.

"ఎన్నాళ్ళు బ్రతుకుతాడో చెప్పలేను. కానీ నాకంటే యెక్కువ కాలమే బ్రతుకుతాడని చెప్పగలను."

అమ్మ కంగారుపడింది "అంటే నీకంటే కూడా చిన్నవాడన్నమాట. నువ్వు చెడింది కాక యితరులను కూడా చెడగొడుతున్నావుట్రా."

"వాడిగురించి నువ్వేం బెంగపెట్టుకోకు. వాణ్ణి నేనేం చెడగొట్టలేదు. వాడు వొకటో రకం ఆరోగ్యంతో ఉన్నాడు. వాడినే జబ్బులూ బాధించలేవు. పెళ్ళి చేసుకుంటే పెళ్ళానికి జబ్బు చేయదని గ్యారంటీ లేదు కదా! వీడికైతే అలాంటి గ్యారంటీ కూడా వుంది. అన్ని వేళల్లోనూ నాకు సాయంగా వుంటాడు వాడు" అన్నాను నేను.

అమ్మ "ముసిల్దాన్ని చేసి నన్ను ఆడిస్తున్నావా? ఓసారి వచ్చి నీ మగతోడును చూడనా?" అంది.

"తప్పకుండా?" అన్నాను.

అమ్మ వచ్చి నా మగతోడు చేసే సేవలు చూసి అదిరిపోయింది.

ఎంత కష్టమైన పని చెప్పినా వాడు అవలీలగా చేసేసేవాడు. ఎన్ని తిట్టినా వాడి సహనం దెబ్బ తినేది కాదు. మనిషి పిడి రాయిలాగున్నాడు. అమ్మమాటలు అన్ని పర్యాయాలూ అర్థమయ్యేవికావు. వాడికినేను వివరించి చెబితే అర్థం చేసుకుని ఆ పని చేసేవాడు.

"ఎక్కడ దొరికాడురా వీడు నీకు?" అంది అమ్మ

"దొరకడ మేమిటమ్మా- నేనే తయారు చేశాను...." అన్నాను.

"తయారు చేయడమేమిట్రా?" అంది అమ్మ ఆశ్చర్యంగా.

బట్టలువేసి, ముఖానికి కాస్త జాగ్రత్తగా మేకప్ చేస్తే నేను చేసిన మరబొమ్మ అచ్చు మనిషిలాగే కనబడుతుంది. అందుకే అమ్మ అంతగా ఆశ్చర్యపడింది.

"వీడిపేరు కంప్యూటర్. నా తెలివితేటలన్నీ ధారపోసి వీణ్ణి తయారుచేశాను" అంటూ అమ్మకు వివరించాను. కంప్యూటర్ నెలా వుపయోగించుకోవాలోకూడా ఆమెకు చెప్పాను. నా దగ్గర ప్రత్యేకమైన ప్రోగ్రాం కార్డులున్నాయి. ఒక వారం రోజుల కార్యక్రమాన్ని ముందుగానే నిర్ణయించి కంప్యూటర్ వీపు వెనకవున్న అరలో ఆ కార్డుల నుంచామంటే మనం చెప్పకుండానే వాడు వారంరోజులపాటు ఆగకుండా తన పనులను వొకదానివెనుక వొకటి వరుసగా చేసుకుంటూ వెళ్ళిపోతాడు.

అమ్మ కాసేపు పెళ్ళిగురించికూడా మర్చిపోయి నా తెలివితేటల్ని పొగిడింది. అయితే పెళ్ళి విషయం గుర్తుకు రావడానికి ఆమెకెంతో వ్యవధి అవసరం లేకపోయింది.

"ఇలాంటి పనిమనిషి ఉన్నాడంటే నీ పెళ్ళాం ఎంతో సుఖపడుతుందిరా?" అంది అమ్మ.


"నాకు పెళ్ళి ఇష్టంలేదు—" అన్నాను.

"బాగుందిరా. నీ తర్వాత నీ తరం వృద్ధి చెందవద్దూ—". అంది అమ్మ.

"అది ఇష్టం లేకనేకదా —నేను పెళ్ళి వద్దంటున్నది." అన్నాను.

"వెధవ కబుర్లు చెప్పకు. నువ్వు పెళ్ళి చేసుకు తీరాల్సిందే — ఎటొచ్చీ నీకు నచ్చే అమ్మాయిని పోనీ నీ తెలివితేటల్తోనే వెతుక్కో—!" అంది అమ్మ.

హఠాత్తుగా నా బుర్రలో ఏదో మెరిసింది.



కంప్యూటర్ని సూపర్‌మాన్‌గా తయారు చేయాలన్నది నా కోరిక. అందుగురించి కొంత విషయసేకరణ చేస్తున్నాను.

ఉదాహరణకు కంప్యూటర్ని జ్యోతిష్కుడుగా ఉపయోగించుకోవచ్చు. అయితే అందుకు జాతకాల గురించిన వివరాలు క్రోడీకరించి కోడ్ భాషలోకి మార్చి కంప్యూటర్‌కి సరఫరా చేయాలి. ఇదే విధంగా కంప్యూటర్ని వాతావరణసూచనకూ ఆటల్లో రిఫరీగావర్తించడానికీ....వగైరా.... వగైరా లెన్నింటికో ఉపయోగించుకోవచ్చు.

అయితే కంప్యూటర్ని పెళ్ళిళ్ళ పేరయ్యగా ఉపయోగించాలన్న ఆలోచన అమ్మ చెప్పేవరకూ తట్టలేదు.

నిజానికి యువతరాన్ని పెదదారులు పట్టించేది పెద్దలే. వారిని భయపెట్టో, బెదిరించో పెదలు తమకు అనుకూలంగా తయారుచేస్తున్నారు. కంప్యూటర్ శక్తి సామర్థ్యాలు యువతరానికి ఋజువుచేశాక కంప్యూటర్ని పెళ్ళిళ్ళ పేరయ్యగా వాడతానంటే చాలామంది యువకులు ముందుకు వస్తారు.

అమ్మ యిచ్చిన సలహాకు ధన్యవాదాలర్పించుకుని మర్నాడే నా పథకాన్ని అమల్లోపెట్టాను.

కంప్యూటర్ని తీసుకుని ఊళ్ళు తిరగ నారంభించాను. నా ప్రదర్శనలు నాకు కనక వర్షం కురిపిస్తున్నాయి. కంప్యూటర్ శక్తి సామర్థ్యాలు చాలామందిని ఆకర్షించాయి.

ప్రతి ఊళ్ళోనూ పెళ్ళి కావలసిన యువతీ యువకుల వివరాలు కంప్యూటర్‌కు అందజేయవలసిందిగా కోరాను. అయితే యిక్కడ నేనొక పద్ధతి ఎన్నుకున్నాను.

కంప్యూటర్‌కి కోడ్ లాంగ్వేజి కావాలి. వచ్చిన వాళ్ళందరి వివరాలూ నేను కోడ్ లాంగ్వేజిలో రాసుకుంటూపోవాలంటేచాలా ఇబ్బంది అవుతుంది. అందుకని ప్రతిరోజూ ఒక సమయాన్ని నిర్ణయించి అప్పుడువచ్చిన వారందరికీ కోడ్‌లాంగ్వేజిలోకి వివరాలనెలా మార్చాలో బోధించేవాణ్ణి. వాటిని వాళ్ళు నేనిచ్చిన ప్రోగ్రాం కార్డుల మీదకు మార్చాలి. ఏ రోజు కారోజు ఈ సమాచారాన్ని నేను కంప్యూటర్ బుర్రలోకి ఎక్కించేసేవాణ్ణి.

ఎంతోమంది యువతీ యువకులు ప్రతి ఊళ్ళోనూ నా దగ్గరకు వచ్చి కంప్యూటర్‌కి వివరాలు చెప్పేవారు. విషయసేకరణకు కొంతకాలం పడుతుందనీ, ఆ తర్వాతనుంచీ కంప్యూటర్ తన నిర్ణయాలు చెప్పడం ప్రారంభిస్తాడనీ వారికి చెప్పాను.

"కంప్యూటర్ కుల,మత భేదాలు తెలుసుకోలేడు. జాతకాల గురించి వాడికి తెలియదు. మీరు కోరిన లక్షణాలుగల తోడును మాత్రం అతను వెతికి పెడతాడు-" అని నేను అందరికీ స్పష్టంగా చెప్పేవాణ్ణి.

కంప్యూటర్లో పేర్లు నమోదు చేయించుకున్న వారంతా కూడా నాకు మనిషి ఒక్కింటికి పది రూపాయల చొప్పున ఇవ్వాలి. ఆరెన్నెల్ల తరువాత నా చిరునామా కుత్తరం రాస్తే వారికి జవాబు వస్తుందని వారందరికీ నేను చెప్పాను.

మన దేశంలో వధూవరుల ఎన్నిక అత్యంత కష్టతరమైనది. అందువల్లనో, లేక కంప్యూటర్ తమకు కలిగించే వినోదం వల్లనో కానీ చాలామంది కంప్యూటర్ కోసం ఎగబడేవాళ్ళు.

ఆర్నెల్లపాటు దేశమంతా తిరిగి నా ఊరు చేరాను. అప్పటికే ఇంట్లో ఉత్తరాలు కుప్పలు కుప్పలుగా పడిఉన్నాయి. ఎందరో కంప్యూటర్ నిర్ణయం గురించి ఆత్ర పడుతూ రాసిన ఉత్తరాలవి.

ఉత్తరాల్లో వారుదహరించిన కోడ్ నంబర్ సహాయంతో కంప్యూటర్ని రంగంలోకి దించాను. వాడికో టైపు మిషన్ యిచ్చాను. నేను కోడ్ నెంబర్ ఫీడ్ చేసినప్పుడల్లా వాడు ఎడ్రస్ టైపుచేస్తూండేవాడు. ఒకోసారి ఆర్డరాఫ్ ప్రిఫరెన్స్ ప్రకారం వాకటికిమించి అడ్రసు లుండేవి.

నేను ఆ సమాచారాన్ని ఉత్తరాల్లో కోరిన ప్రకారం పంపించేశాను.

రెండు మూడు వారాలతర్వాత కంప్యూటర్నభినందిస్తూ ఉత్తరాలు రాసాగాయి. ఆ క్షణంనుంచీ ప్రతిరోజూ కంప్యూటరు అభినందన పరంపరలే! వాడి ఎన్నిక మహాద్భుతంగా వున్నదట.

అపూర్వమైన వధువును తమకు ఎన్నిక చేసిపెట్టినందుకు ధన్యవాదాలు చెబుతూ కొందరు యువకులుత్తరాలు రాస్తే, ఈ ఎన్నిక కారణంగా తమకు వరకట్నం తగ్గినదని కొందరు యువతులు రాశారు.

అయితే అక్కడక్కడ కొన్ని లోపాలూ లేకపోలేదు.కొందరు కావాలని కంప్యూటర్‌కి తప్పుడు సమాచారం ఇచ్చారు. అలాంటి వారి విషయంలో ఎన్నిక దెబ్బతింది.

కంప్యూటర్ మొత్తం మీద ఘన విజయాన్ని సాధించి దేశంలో సంచలనాన్ని కలిగించింది. దేశం నలుమూలల నుంచీ


# సాంకేతిక విజ్ఞాన గ్రంథములు

విశ్రాంతి సమయంలో ఇంట్లోనే వుండి ఆయా పనిముట్లను సరిచేసుకునే వారికి, విద్యా సంస్థలలో చేరి విద్యనభ్యసించేవారికి, వివిధ సంస్థలలో పని చేసుకునేవారికి అతి సులభముగా అర్థమయేటట్లు చిత్రాలతో వివరించివున్నాము. ప్రతి ఇంటా వుండి అందరికీ ఉపయోగపడే ఉత్తమ గ్రంథములు.

| | వెల రూ. | | వెల రూ. |
|---|---|---|---|
| ట్రాన్సిస్టర్ రిపేరింగ్ | 4-50 | వాల్వ్ రేడియో రిపేరింగ్ | 10-00 |
| ట్రాన్సిస్టర్ రేడియో | 4-50 | టేప్ రికార్డర్ | 6-50 |
| హౌస్ వైరింగ్ | 5-75 | టి. వి. మెకానిజం | 7-50 |
| మోటార్ రీవైండింగ్ | 6-50 | మోటార్ మెకానిజం | 6-00 |
| లేత్ వర్క్ | 6.75 | మాడరన్ టైలరింగ్ స్త్రీలు | 8-75 |
| గేస్ & ఆర్క్ వెల్డింగ్ | 7-50 | మాడరన్ టైలరింగ్ పురుషులు | 8.75 |
| మెటల్ & షీట్ మెటల్ | 6.50 | మాడరన్ టైలరింగ్ పిల్లలు | 7-50 |
| కరాటే | 200 పైగా చిత్రాలతో | | 12-00 |

మీరు పుస్తకాలకు ఆర్డర్ చేసేటప్పుడు పుస్తకాల వెలలో తప్పనిసరిగా సగం అడ్వాన్సుగా పంపాలి. మిగతా సొమ్ముకు వి.పి.గా పంపుతాము.

Also learn all our National Languages in 30 days through your mother tongue

Balaji Publications
103 Pycrofts Road Madras 600 014

యెందరో కంప్యూటర్‌కి తమ వివరాలందించడానికి రాసాగారు. ఇప్పటికే కంప్యూటర్‌వద్ద చాలా సమాచారముండడంవల్ల కొత్తవారెవరూ ఎక్కువ ఎదురుచూడనవసరంలేదు. వచ్చి కంప్యూటర్‌కి తమ వివరాలందించిన వెంటనే జవాబు కోసం ఎదురు చూడవచ్చును.

కంప్యూటర్ గురించి నిత్యం వచ్చే సందడిని నేను భరించనవసరం లేకుండా— ఓ మనిషిని నియమించాను. అతడు పూర్తిగా కంప్యూటర్ పెళ్ళిళ్ళ పేరయ్య సంగతి చూసుకునేవాడు.




నానాటికీ కంప్యూటర్ పేరు ప్రఖ్యాతులు పెరుగుతున్నాయి.

నా కంప్యూటర్‌లో ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి యువకుడూ తనకెలాంటి వధువు కావాలనుకుంటాడో, ప్రతి యువతీ తనకెలాంటి వరుడు కావాలనుకుంటుందో తెలిశాక దాన్ని బట్టి సాధారణంగా యువతీ యువకులు ఆలోచనలెలావున్నాయో ఊహించగలడు వాడు. తర్వాత ఎప్పుడైనా యువతీ యువకులు తమ వివరాలను మాత్రం ఇచ్చి తమకెలాంటి వరుడు, వధువు కావాలో చెప్పకపోయినా - పాత మెమరీ (జ్ఞాపకం)ని బట్టి నిర్ణయాలు చేయగలడు. ప్రస్తుతం దేశ విదేశాల్లో వున్న అనేక కంప్యూటర్లీ దేపద్ధతిలో పనిచేస్తాయి. ఈ కంప్యూటర్‌కి నేను మనిషి రూపాన్నిచ్చాను. అంతే తేడా!

ఇలా కొన్ని నెలలు గడిచే సరికి అమ్మ చెప్పాపెట్టకుండా నా దగ్గరకి వచ్చింది.


దేశమంతటికీ పెళ్ళిళ్ళ పేరయ్యలా వ్యవహరిస్తున్నావుగానీ మరి నీ పెళ్ళి సంగతేమిటని నిలదీసింది.

"నాకు పెళ్ళివద్దు!" అన్నాను.

"ఎందుకని?" అంది అమ్మ.

"నా ఎలక్ట్రానిక్ బుర్రతో చైతన్యవంతమైన యువతరానికి ఎంతో సేవ చేయాలి. నేను సృష్టించిన కంప్యూటర్ పెళ్ళిళ్ళ విషయంలో పెద్దల ప్రమేయం తొలగించాడు. ఇలాంటి సాధనాలింకా కనిపెడతాను. ఈ సాధనాలే నాకు బిడ్డలై నా పేరు చిరస్థాయి చేస్తాయి. నీ బిడ్డల్లాకాక నా బిడ్డలు తరతరాలు బ్రతికి వర్ధిల్లుతారు. నిరర్థకమైన తరాన్ని వృద్ధిచేసే పెళ్ళి నాకు వద్దు. నా జీవితం ఈ యువతరానికి అంకితం చేసి-మన దేశంలో కొత్తరకం సృష్టి కావడానికి ప్రాతిపదిక వేస్తాను" అన్నాను.

అమ్మ ఇంచుమించు ఏడుపు ముఖం పెట్టి- "ఒరేయ్. నీకేదో పిచ్చి పట్టింది. నీ ఆశయాలన్నింటికీ అంగీకరించి నీకు చేదోడు వాదోడుగా నిలిచే ఆడపిల్ల వస్తే- నువ్వు నీ ఆశయాలని బాగా ఆచరణలో పెట్టగల్గుతావేమో ఆలోచించరా?" అంది.




అవును. అమ్మ చెప్పిన విషయం ఆలోచించ దగ్గదే! నేను సృష్టించిన కంప్యూటర్ వుండగా అలాంటి అమ్మాయి వుంటే తెలుసుకోవడం అసాధ్యంకాదు.

అయితే నా పేరు చెప్పి వధువును వెతుక్కోవడం నా కిష్టంలేకపోయింది.

అసలు కంప్యూటర్ కెలాంటి అమ్మాయి యిష్టమో? వాడే పెళ్ళి చేసుకోవాలనుకుంటే ఎలాంటి అమ్మాయిని చేసుకుంటాడో?....ఎలాంటి అమ్మాయిని చేసుకున్నా .... ఆ అమ్మాయి అద్భుత లక్షణాలు కలిగినదై వుండాలి. దేశంలోని యువకులలో అత్యధిక సంఖ్యాకులు కోరికలకనుగుణంగా వుండే ఆ అమ్మాయి ఎవరో తెలుసుకుంటే- ఆ తర్వాత ఆమెను పెళ్ళి చేసుకునే విషయం ఆలోచించవచ్చు. అసలు — ఆమె ఎవరో తెలుసుకోవాలన్న కుతూహలమే చాలా ఎక్కువగా వుంది!

మర్నాడు కంప్యూటర్ని ఈ ప్రశ్న వేశాను .... "నీకు పెళ్ళి చేద్దామనుకుంటున్నాను. ఎవర్ని చేసుకుంటావో చెప్పు!"

"సమాధానం చెప్పడానికి కంప్యూటర్‌కి ఎంతోసేపు పట్టలేదు—" అది సాధ్యంకాదు నాకు కుదిరే వధువు లేదు.

"ఎందువల్ల?" అన్నాను. ఆశ్చర్యంగా.

"పెళ్ళి చేసుకుందుకు నాకు మరొక కంప్యూటర్ కావాలి. కంప్యూటర్ని తప్ప మరెవర్ని నేను పెళ్ళి చేసుకోను."

దేశంలోని అత్యధిక సంఖ్యాకులైన యువకుల అభిప్రాయానికి ప్రతినిధి అయిన కంప్యూటర్ చెప్పిన మాటలు విన్న నాకు నోట మాట రాలేదు. నేను అసహ్యించుకునే పాత తరానికి ప్రతినిధిగా నేను సృష్టించిన కంప్యూటర్ తయారయ్యాడంటే అందుకు కారణం నేటి యువతరమేనా? అదే నిజమైతే నేను సాధించదల్చిన దేమిటి? సాధించగల్గినదేమిటి? అనుకున్నది అనుకున్నట్లు సాధించాలంటే నేను ఏం చేయాలి?

బహూశా ఇది బదులులేని ప్రశ్న అనుకుంటాను.

—